RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 111 | మే 17 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 111 | May 17 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


**నేపాలి నిందితుల అరెస్ట్**

2

## సీబీఎస్ఈ సిలబస్‌లో మార్పు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పాఠశాలల్లో భాషల బోధనా విధానంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయి. రాబోయే 2026 జులై 1వ తేదీ నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు 'త్రిభాషా సూత్రాన్ని' (మూడు భాషల విధానం) తప్పనిసరి చేస్తూ బోర్డు అధికారిక సర్క్యులర్ జారీ చేసింది. జాతీయ విద్యా విధానం , నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సూచనలకు అనుగుణంగా, 2026-27 విద్యా సంవత్సరానికి

➤ మిగతా 2వ పేజిలో..

## సామాన్య ప్రజల నెత్తిన పిడుగు

### పెట్రో ధరలపై పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెంపుదలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజల నెత్తిన పిడుగు పడినట్లవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం ఏ రకంగానూ సమర్థనీయం కాదని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా స్పష్టం చేశారు. ఈ అనాలోచిత నిర్ణయం రవాణా రంగంతో పాటు దేశంలోని అనేక రంగాలపై తీవ్ర వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుందని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలన మరియు లోపభూయిష్ట విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ నేడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్రం ప్రచారం చేసుకుంటున్న 'ఆత్మనిర్భర్ భారత్' అనేది కేవలం ఎన్నికల్లో ఓట్లు రాల్చుకోవడానికి పనికొచ్చే నినాదమే తప్ప, క్షేత్రస్థాయిలో ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వలేదని తేలిపోయిందన్నారు. దేశంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు



కుదేలయ్యాయని, యువతకు ఉపాధి భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ కూడా గాలికి కొట్టుకుపోయిందని ఎద్దేవా చేశారు. గత పదేళ్లుగా అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ నిరంతరాయంగా పతనమవుతూ వస్తోందని,

➤ మిగతా 2వ పేజిలో..

## డిజిటల్ చెల్లింపులో భారత్ అగ్రస్థానం

### నేదర్లాండ్ పర్యటనలో ప్రధాని మోడీ

**దిహేగ్ జనసంఘర్షణ**

నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో దేశ ప్రగతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ప్రవాస భారతీయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. డిజిటల్ చెల్లింపుల రంగంలో భారతదేశం నేడు ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, దేశంలో నెలకు ఏకంగా 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఒకప్పుడు దేశంలో కేవలం 4 యూనికార్న్ సంస్థలు మాత్రమే ఉండేవని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య 100కు పైగా దాటిందని సగర్వంగా ప్రకటించారు. సాంకేతిక రంగంలో అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల తయారీలోనూ భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, దేశీయంగా ప్లాంట్ల పనులు చురుగ్గా సాగుతూ 'మేడిన్ ఇండియా' చిప్‌లు రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో



భారతదేశం ప్రతిష్టాత్మక ఏఐ సమ్మిట్‌తో పాటు జీ20 సమావేశాలను అత్యంత విజయవంతంగా నిర్వహించిందని గుర్తుచేశారు. దేశంలో

➤ మిగతా 2వ పేజిలో..

## స్త్రీనిధిని కాపాడుకోవాలి

### మంత్రి సీతక్క

**హైదరాబాద్ జనసంఘర్షణ**



తెలంగాణ సమాజంలో మహిళల ఆర్థిక ప్రగతికి స్త్రీనిధి సంస్థ అందిస్తున్న తోడ్పాటు ఎంతో విలువైందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కొనియాడారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులు తమ హక్కులతో పాటు విధులను కూడా బాధ్యతాయుతంగా గుర్తుంచుకోవాలని, మనందరి సంస్థ అయిన స్త్రీనిధిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆమె సూచించారు. గతంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపుల వల్ల మహిళలు పడిన బాధల నుంచి వారికి శాశ్వత విముక్తి కల్పించాలనే సత్సంకల్పంతోనే ఈ స్త్రీనిధి ఏర్పాటయిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఇప్పటివరకు సుమారు 32 లక్షల మంది మహిళలకు రూ.24 వేల కోట్ల భారీ రుణాలను పంపిణీ చేసిందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో తెలంగాణ మహిళలందరికీ అత్యంత నమ్మకమైన బ్యాంకుగా స్త్రీనిధి ఎదగాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రంలో విజయవంతంగా నడుస్తున్న స్త్రీనిధి మోడల్‌ను నేడు ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుని అనుసరిస్తున్నాయని వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఈ బ్యాంక్‌పై కొందరు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి అవాస్తవ ప్రచారాలు లేదా ఫిర్యాదులు వచ్చినప్పుడు ప్రభుత్వం వెంటనే వాటిని నిరూపించి, బాధ్యులపై

➤ మిగతా 2వ పేజిలో..

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన 'నీట్' ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ భారీ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని ఆయన ప్రధానమంత్రి



➤ మిగతా 2వ పేజిలో..

## బంగారం, వెండి ధరల్లో భారీ పతనం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, యూఎస్ డెట్ సెక్యూరిటీలపై పెరిగిన రాబడులు మరియు డాలర్ బలోపేతం కావడం వంటి పరిణామాల నేపథ్యంలో దేశీయంగా బంగారం, వెండి ధరల్లో భారీ పతనం నమోదైంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ గణాంకాల ప్రకారం, హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర శుక్రవారంతో




పోలిస్తే రూ.980 మేర క్షీణించి రూ.1,56,930కు పడిపోగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా రూ.900 తగ్గి రూ.1,43,850 వద్దకు చేరుకుంది. ఇదే సమయంలో నగరంలో కిలో వెండి ధర ఏకంగా రూ.15 వేల మేర పతనమై రూ.2.9 లక్షలకు దిగొచ్చింది. దేశవ్యాప్తంగా సగటున 24 క్యారెట్ల బంగారం ధర రూ.950

➤ మిగతా 2వ పేజిలో..

# సామాన్య ప్రజల నెత్తిన పిడుగు

**మొదటిపేజీ తరువాయి..**

ఇప్పుడు ఆ పతనం పరాకాష్టకు చేరిందని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను సాకుగా చూపుతూ చమురు కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ప్రపంచంలోనే భారతదేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దామని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం, ఈ ధరల పెంపును ఏ ముఖం పెట్టుకుని సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇంధన ధరలను పెంచబోమంటూ పదే పదే ప్రకటనలు గుప్పించిన కేంద్రం, ఎన్నికల ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే లీటరుపై రూ.3 కి పైగా అదనపు భారం మోపడం ప్రజలను నిలువునా వంచించడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, ఎన్నికల్లో గెలుపు కోసమే మోదీ ప్రభుత్వం ఇటువంటి అబద్ధాలు ఆడుతోందని ప్రజలు గ్రహించారని, ఇది ముమ్మాటికీ విశ్వాసఘాతుకమేనని అన్నారు. దేశ ప్రజలపై పడిన ఈ అదనపు భారాన్ని పరిగణనలోకి తీసుకుని, కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా డిమాండ్ చేశారు.

## స్త్రీనిధిని కాపాడుకోవాలి

**మొదటిపేజీ తరువాయి..** కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అయితే ఇలాంటి తప్పుడు ఆరోపణల వల్ల వ్యవస్థ ప్రతిష్ట దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. మహిళల సముచిత అభివృద్ధే దేశ, సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని నమ్మే తమ ప్రభుత్వం.. మహిళలు చేపట్టే చిన్న తరహా వ్యాపారాలకు, గృహాధారిత ఉపాధి రంగాలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహాన్ని అందిస్తోందని చెప్పారు. ముఖ్యంగా అట్టడుగున ఉన్న ఆదివాసీ మహిళల స్వయంకృషి ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు.

స్త్రీనిధి అనేది పూర్తిగా మహిళల సంక్షేమం కోసం, మహిళల ఆధ్వర్యంలోనే నడిచే ఒక గొప్ప స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అని, దీనిని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ ఉద్యోగుల శ్రేయస్సును కోరే సానుకూల ప్రభుత్వమని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. స్త్రీనిధి సంస్థ స్థాపనలో మరియు దానిని విజయవంతమైన పథంలో నడిపించడంలో విశేష కృషి చేసిన విద్యాసాగర్ రెడ్డి సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుని, లక్షలాది మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## జవహర్ నగర్ చోరీ

## కేసును ఛేదించిన పోలీసులు

**నేపాలీ దంపతులతో పాటు మరొకిరి అరెస్ట్**

**నిందితుల నుంచి నగదు, బంగారం స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన డిసిపి సుమతి**

**హైదరాబాద్, మే16** : సికింద్రాబాద్‌లోని జవహర్‌నగర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను కట్టేసి ఇంట్లో చోరీ చేసిన నేపాలీ ముఠాలో కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 12న జరిగిన చోరీలో నేపాలీ దంపతులు మమత, రమేశ్‌తోపాటు సబీనాను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నేపాలీ ముఠా సభ్యులు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు. ఈ చోరీ కేసును 250కి పైగా సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడంతో లభించిన క్లూస్ ఆధారంగా 72 గంటల్లో ఈ కేసును ఛేదించినట్లు మల్కాజ్‌గిరి సీపీ సుమతి వెల్లడించారు. పక్కా ఎ÷–లాన్‌తో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి తెగబడిన ఈ ముఠాలో నలుగురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మీనా అలియాస్ మమత పుట్టిన రోజు వేడుకల కోసం మిగతా వారు వచ్చారని యజమానులను నమ్మించి.. వృద్ధ దంపతులను కట్టేసి ఈ ముఠా చోరీకి పాల్పడిందని వివరించారు. ఇకపై ఇంటి యజమానులు ఎవరైనా పనిలో పెట్టుకొనేవారి వివరాలను తాము రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేయాలని సుమతి సూచించారు. జవహర్‌నగర్‌లోని కౌకూర్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ (68), భార్య డాక్టర్ విజయలక్ష్మి (58) నివాసం ఉంటున్నారు. నమ్మకంగా పనికి కుదిరిన నేపాలీ దంపతులు పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటామని చెప్పారు. యజమాని ఇంట్లో చోరీ చేసేందుకే నేపాలీ వాళ్లను మమత, రమేశ్ రప్పించారు. అర్ధరాత్రి దాటాక ఇంటి యజమానులు మురళీధర్, విజయలక్ష్మి దంపతులను కట్టేసి చోరీకి పాల్పడ్డారు. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండి, రూ. 30వేల నగదు, 3 వేల డాలర్లతో నేపాలీ ముఠా పరారైంది.

## బుల్లెట్ బండి ఎక్కిన చంద్రబాబు

**శ్రీకాకుళం, మే16** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో పర్యటించారు. 'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సమీపంలోని స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్వర ఆర్ట్ గ్యాలరీ'లో గిరిజనులు ప్రత్యేకంగా రూపొందించిన ఓవర్‌కోట్‌ను ఆయన కొనుగోలు చేసి ధరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. పోలీసులను అభినందించిన సీఎం హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం ఎక్కారు. ఆయన

# డిజిటల్ చెల్లింపులో భారత్ అగ్రస్థానం

**మొదటిపేజీ తరువాయి..** ప్రజాస్వామ్య వ్యవస్థ బలాన్ని వివరిస్తూ.. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 64 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఈ సంఖ్య మొత్తం యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల జనాభా కంటే ఎక్కువని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. ప్రవాస భారతీయుల నుంచి వ్యక్తమైన అపారమైన ప్రేమ, ఉత్సాహాన్ని చూస్తుంటే తాను నెదర్లాండ్స్‌లో ఉన్నాననే సంగతి మర్చిపోయి, భారతదేశంలోనే ఏదో ఒక పెద్ద ఉత్సవంలో పాల్గొంటున్నట్లు అనిపిస్తోందని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో తాను ఎప్పుడు మాట్లాడినా వారు అక్కడి భారతీయ సమాజంపై ప్రశంసల జల్లు కురిపిస్తారని, ఇక్కడి సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు ఎన్ఆర్ఐలు అందిస్తున్న సేవలు ప్రతి భారతీయుడికి గర్వకారణమని కొనియాడారు. కాలక్రమేణా ప్రపంచంలో ఎన్నో సంస్కృతులు కనుమరుగైనప్పటికీ, భారతీయ విభిన్న సంస్కృతి, జీవన విధానం మాత్రం ప్రజల హృదయాల్లో నేటికీ చెక్కుచెదరకుండా బలంగా ఉందన్నారు. తరాలు మారి, దేశాలు మారినా భారతీయులలో కుటుంబ విలువలు, మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు మరియు సంప్రదాయాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం 2014 మే 16న దేశంలో దశాబ్దాల తర్వాత సంపూర్ణ మెజారిటీతో ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని గుర్తుచేస్తూ.. నాటి నుంచి నేటి వరకు కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే తనను అలసిపోకుండా, ఆగకుండా నిరంతరం దేశ సేవలో ముందుకు నడిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.

# సీబీఎస్ఈ సిలబస్‌లో మార్పు

**మొదటిపేజీ తరువాయి..** ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నూతన సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. ఏప్రిల్‌లోనే విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జులై నుంచి ఒక పరివర్తన ప్రక్రియ ద్వారా దీనిని అమలు చేయనున్నారు.

కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థులు అభ్యసించే మూడు భాషల్లో కనీసం రెండు భాషలు కచ్చితంగా స్థానిక భారతీయ భాషలై ఉండాలి. ఒకవేళ ఎవరైనా విద్యార్థులు ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలను చదవాలనుకుంటే, మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలైనప్పుడు మాత్రమే దానికి అనుమతి లభిస్తుంది లేదా విదేశీ భాషను నాల్గవ అదనపు భాషగా ఎంచుకోవాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు గానూ ఈ నూతన విధానంలోని మూడో భాషకు 10వ తరగతిలో బోర్డు పరీక్ష ఉండదని, పాఠశాల స్థాయిలోనే ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా మార్కులు లేదా గ్రేడులు ఇస్తారని బోర్డు వెల్లడించింది. కాకపోతే ఇందులో ఉత్తీర్ణత సాధించడం మాత్రం పూర్తి తప్పనిసరి.

మిడిల్ స్కూల్, సెకండరీ స్టేజ్ చదువుల మధ్య లాంగ్వేజ్ స్కిల్స్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి అంశాలలో 75 నుంచి 80 శాతం వరకు పోలికలు ఉంటాయని బోర్డు పేర్కొంది. అందువల్ల ప్రస్తుతానికి 9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన 6వ తరగతి స్థాయి పాఠ్య పుస్తకాలనే ఉపయోగించనున్నారు. ఈ పుస్తకాలతో పాటు స్థానిక, రాష్ట్ర స్థాయి సాహిత్యానికి సంబంధించిన కథలు, కవితలను కూడా సిలబస్‌కు అదనంగా చేర్చాలని పాఠశాలలను ఆదేశించింది. దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను 2026 జూన్ 15 నాటికి సీబీఎస్ఈ విడుదల చేయనుంది. అలాగే జులై 1 లోపు 19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి ఎల్3 పాఠ్య పుస్తకాలను బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది. తాజా నిర్ణయంతో భారతీయ భాషలను ప్రవేశపెట్టడం వల్ల స్కూళ్లలో అర్హులైన ఉపాధ్యాయుల కొరత ఏర్పడే అవకాశం ఉందని గుర్తించిన బోర్డు, దీని కోసం పాఠశాలలకు కొన్ని కీలకమైన మినహాయింపులు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది.

# నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మే16** : ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే తెలంగాణలో మాత్రం ఎండల తీవ్ర తగ్గడం లేదు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41–44 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

# బంగారం, వెండి ధరల్లో భారీ పతనం

మేర తగ్గగా, వెండి ధరలో రూ.10 వేల మేర కోత పడింది. ఇతర ప్రధాన నగరాల విషయానికొస్తే, చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,60,910గా, 22 క్యారెట్ల బంగారం రూ.1,47,500గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,57,080 వద్ద, 22 క్యారెట్ల ధర రూ.1,44,000 వద్ద ట్రేడవుతోంది. ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,56,930కు, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,850కు చేరింది. దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లోనూ కిలో వెండి ధర రూ.3 లక్షల మార్కు కంటే దిగువకు పడిపోవడం గమనార్హం.

మరోవైపు అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావంతో భారత కరెన్సీ రూపాయి విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒక దశలో 50 పైసలు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా రూ.96.14 మార్కును దాటింది. అమెరికా–ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదల, డాలర్ ఇండెక్స్ బలోపేతం కావడం మరియు దేశీయంగా ద్రవ్యోల్బణ భయాలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. అయితే ఆర్‌బీఐ సకాలంలో జోక్యం చేసుకోవడంతో రూపాయి కొంతవరకు కోలుకుని, చివరికి 17 పైసల నష్టంతో రూ.95.81 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో పోల్చే డాలర్ ఇండెక్స్ 0.34 శాతం పెరిగి 99.15 స్థాయికి చేరగా, బ్రెంట్ ముడి చమురు ధర 3.14 శాతం పెరిగి బ్యారల్‌కు 109.04 డాలర్లకు ఎగబాకింది. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూపాయి విలువ దాదాపు 2 శాతం మేర క్షీణించగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు మొత్తం 6 శాతానికి పైగా పతనమైంది. పశ్చిమాసియా సంక్షోభం, చమురు ధరలు 100 డాలర్ల పైకి చేరడం, దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ మరియు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం తగ్గడం వంటి అంశాలు రూపాయిపై ఒత్తిడిని పెంచాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాబోయే రోజుల్లో కూడా రూపాయిపై ఈ ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని, డాలర్‌తో మారకం రేటు రూ.95.60 నుండి రూ.96.20 శ్రేణిలో కదలాడవచ్చని ఆర్థిక రంగానికి చెందిన విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**మొదటిపేజీ తరువాయి..** నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందని, ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ కనీసం నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేస్తారా లేక స్వయంగా ప్రధానమంత్రే ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తారా అని ప్రశ్నిస్తూ, 'మోదీ జీ.. ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పుడే తొలగించండి' అని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం మే 3న నిర్వహించిన ఈ పరీక్షలో పెద్ద ఎత్తున అవకతవకలు వెలుగుచూడటంతో పరీక్షను రద్దు చేయాల్సి వచ్చిందని, దీంతో దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయని గుర్తుచేశారు. ప్రభుత్వం జూన్ 21న తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, రెండేళ్ల పాటు రేయింబవళ్లు కష్టపడిన 22 లక్షల మంది విద్యార్థుల కఠోర శ్రమ ఈ లీకేజీ వల్ల బూడిదలో పోసిన పన్నీరైందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష జరగడానికి రెండు రోజుల ముందే నీట్ పేపర్ వాట్సాప్‌లో చక్కర్లు కొట్టిన విషయం యావద్దేశానికి తెలుసని, అయితే ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ మరియు యూనివర్సిటీ ఉన్నతాధికారుల మధ్య ఉన్న అపవిత్ర బంధం వల్లే దేశ విద్యావ్యవస్థ తీవ్రంగా నాశనమవుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రస్తుత రోజుల్లో ప్రతిభ, సబ్జెక్ట్ నాలెడ్జ్ ఆధారంగా కాకుండా కేవలం సైద్ధాంతిక అనుబంధాల ప్రాతిపదికన, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారికే వైస్ ఛాన్సలర్ల పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో ఇప్పటివరకు దాదాపు 80 సార్లు వివిధ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని, దీనివల్ల దాదాపు రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు పూర్తిగా నాశనమైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయడంతో పాటు, ఈ లీకేజీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మరియు ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లతో 'పేదరికంపై' ప్రజా యుద్ధం

- కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ చొరవ
- సొంతింటి కల.. సామాన్యుడి ఆత్మగౌరవం :22వ వార్డులో కొర్లపాటి శివ కిరణ్ అండ






ఇల్లందు మే 16 (జన సంఘర్షణ)

రాజకీయాల్లో మాటలు కోటలు దాటడం సహజం, కానీ ఇచ్చిన మాటను పేదవాడి గుమ్మం వరకు చేర్చడమే అసలైన ప్రజాస్వామ్య విజయం. ఈ సత్యాన్ని నిరూపిస్తూ, ఇల్లందు మున్సిపాలిటీ 22వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం శనివారం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్‌తో కలిసి 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ ఈ పర్యటనలో చురుగ్గా పాల్గొన్నారు. స్వయంగా ప్రతి ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తూ, లబ్ధిదారులతో మమేకమైన కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ ప్రజాప్రతినిధి అంటే కేవలం అధికార పీఠం కాదు, ప్రజల కష్టాల్లో పాలుపంచుకునే 'సారథి' అని నిరూపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో సాగుతున్న ఈ ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం ఇటుకలు, సిమెంట్‌తో కట్టే నిర్మాణాలు కావు... సమాజంలో నిరుపేదలకు దక్కే ఆత్మగౌరవ ప్రతీకలు. నాలుగు దఫాలుగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నిధులు జమ కానున్న నేపథ్యంలో, నాణ్యతతో కూడిన గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అధికారులను, లబ్ధిదారులను శివ కిరణ్ సమన్వయపరిచిన తీరు అభినందనీయం. రాజకీయం అంటే ఎన్నికల వేళ ఓట్ల వేట మాత్రమే కాదు, ఐదేళ్ల పాటు పేదవాడి సొంతింటి కలను నిజం చేసే నిరంతర తపన అని ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా వార్డు స్థాయిలో కొర్లపాటి శివ కిరణ్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ ఇల్లందు మున్సిపాలిటీలోనే ఒక ఆదర్శంగా నిలుస్తోంది.

# అష్టముఖి కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించడానికి పోటెత్తిన భక్తులు

- జనకంపేట్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు





నిజామాబాద్ జానకంపేట్/మే 16/(జన సంఘర్షణ)

శనివారం అమావాస్య వస్తే ఆ రోజు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ శివారులో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం పక్కన గల అష్టముఖి కోనేరులో స్నానాలు చేస్తే పాపాలు తొలగిపోయి మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. కేవలం శనివారం మాత్రమే అమావాస్య వస్తే అదే రోజు ఈ అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరిస్తారు భక్తులు. కోనేరులో స్నానాలు చేసి కోనేరు చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసిన భక్తులు అనంతరం ఆలయంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. తమ కుటుంబాలు చల్లగా చూడు అంటూ, ఇలాంటి అంటు వ్యాధులు రాకుండా చూసి, పాడి పంటలతో రైతుల ఇల్లు కళకళలాడాలని భక్తులు ఆ లక్ష్మీనరసింహస్వామిని కోరుకున్నారు. ఉదయం 5 గంటలకే భక్తులు అష్టముఖి కోనేరుకు చేరుకున్నారు. ఇంకా సాయంత్రం వరకు వేలాదిమంది భక్తులు అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరించడానికి వచ్చే అవకాశాలు ఉండడంతో ఆలయ కమిటీ కోనేరు వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. మహిళలు బట్టలు మార్చుకోవడానికి గదులను ఏర్పాటు చేశారు. కోనేరు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటుతో పాటు కోనేరులోకి ఎవరు వెళ్లకుండా గజ్జ ఈతగాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న జానకంపేట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం పక్కన గల అష్టముఖి కోనేరులో స్నానాలు చేయడానికి భక్తులు పోటీ పడుతున్నారు. పెద్ద ఎత్తున ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అష్టముఖి కోనేరు చుట్టూ ఎటు చూసినా భక్త జనంతో జనసంద్రంగా మారిపోయింది. కోనేరులో స్నానం చేసిన భక్తులు తప్పనిసరిగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇప్పటికే రెండు కిలోమీటర్ల వరకు ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో, భక్తులు అష్టముఖి కోనేరు వరకు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొండపైన వాహనాలను నిలపడానికి సరైన స్థలం లేకపోవడంతో ప్రధాన రహదారి వెంబడి వాహనాలను భక్తులు నిలిపివేసి ఆలయం వరకు పాదయాత్రగా బయలుదేరుతారు. అష్టముఖి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి తమ మొక్కులను తీర్చుకుంటారు భక్తులు. ఈ సందర్భంగా ఆలయం వద్ద జాతర కొనసాగుతుంది.

# రైతు గుండెల్లో ధైర్యం

- 'అవసరమైతే యార్డ్ లోనే ఉంటా' : ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఇల్లందు మే 16 (జన సంఘర్షణ)

రాజకీయాలు, ఎన్నికల కోలాహలాలు ముగిసినా.. నిరంతరం ప్రజల కోసమే తపించే నాయకత్వమే నిజమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనం. ఆకాశం ఎప్పుడు అలుముకుంటుందో, అకాల వర్షం ఎప్పుడు ముంచెత్తుతుందో తెలియక కొనుగోలు కేంద్రాల్లో గుండె చేతుల్లో పట్టుకుని ఎదురుచూస్తున్న అన్నదాతకు నేనున్నానంటూ భరోసానిచ్చారు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య. శనివారం ఇల్లందు మార్కెట్ యార్డ్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ నిలువ ఉన్న జొన్నల ఉత్పత్తుల కొనుగోలు, రవాణా ప్రక్రియపై వ్యవసాయ, రెవెన్యూ, మార్కెఫెడ్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. క్వింటాళ్ల లెక్కలతో సహా క్షేత్రస్థాయి పరిస్థితులను ఆరా తీసిన ఎమ్మెల్యే.. అధికారుల ఉదాసీనతకు తావులేకుండా, రేపటి నుంచే గోదాములకు తరలించే ప్రక్రియను ముమ్మరం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ.. "అకాల వర్షాల వల్ల ఒక్క గింజ కూడా పాడవడానికి వీల్లేదు. అవసరమైతే రేపటి నుండి నేనే స్వయంగా మార్కెట్ యార్డ్‌లోనే ఉండి పనులను పర్యవేక్షిస్తాను" అని ప్రకటించడం ఆయనలోని నిబద్ధతకు అద్దం పడుతోంది. కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా, రవాణా ఇబ్బందులు తొలగించడానికి అదనపు వాహనాలను సమకూర్చాలని, పనులు వేగవంతం చేసేందుకు హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. రెండు మూడు రోజుల్లో యార్డ్ ఖాళీ అయిపోవాలన్న ఆయన అల్టిమేటం అధికారుల్లో కదలిక తెచ్చింది. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, వ్యవసాయ శాఖ ఏడీ లాల్ చంద్, సొసైటీ సీఈఓ హీరాలాల్, టౌన్ ప్రెసిడెంట్ బోళ్ళ సూర్యం, కోఆప్షన్ మెంబర్ మడుగు సాంబమూర్తి తదితరులు పాల్గొని ఎమ్మెల్యే వ్యూహానికి మద్దతుగా నిలిచారు. పాలకుల ఆలోచనకు, క్షేత్రస్థాయి ఆచరణకు మధ్య దూరం తగ్గినప్పుడే రైతుకు నిజమైన న్యాయం జరుగుతుందని ఈ సమావేశం నిరూపించింది.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఉన్న నామిరెడ్డి వెంకట్రామిరెడ్డి అకాల మరణం తీవ్ర విచారకరం..





నల్గొండ/మే 16/(జన సంఘర్షణ)

నల్లగొండ నియోజకవర్గం తిప్పర్తి మండలం ఉమ్మడి రాజపేటకు రెండు పర్యాయాలు ఎంపీటీసీ గా, జొన్నగడ్డల గూడెం సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఉన్న నామిరెడ్డి వెంకట్రామిరెడ్డి అకాల మరణం తీవ్ర విచారకరం.. శనివారం జొన్నలగడ్డలగూడెంలో జరిగిన వెంకట్రామిరెడ్డి అంత్యక్రియల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని, వారి పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు..ఈ కష్టసమయంలో వెంకట్రామిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ పరంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లికి 10.000 రూ. నగదు ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ ఎంఏ హకీము



పోతంగల్ జల్లాపల్లి/మే 16/(జన సంఘర్షణ)

పోతంగల్ మండలంలోని జల్లాపల్లి గ్రామంలో రవుఫ్ కూతురు అల్ఫియా పెళ్లికి పొతంగల్ మండల బిఆర్ఎస్ నాయకుడు, సామాజిక కార్యకర్త డాక్టర్ హకీమ్ పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జల్లాపల్లి ఆబాది ప్రెసిడెంట్ మజీద్ నాకు సమాచారం ఇవ్వడం జరిగింది. రావూఫ్ ఆరోగ్యం పరిస్థితి బాగా లేకపోవడం, క్యాన్సల్ లేకపోతే బాధపడుతున్న పరిస్థితుల్లో తన కూతురు పెళ్లికి తనకు తోచిన సహాయం అందజేశానని తెలిపారు. డాక్టర్ హకీమ్‌కు గ్రామస్తులు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నందుకు గ్రామం తరపు నుండి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మజీద్ ప్రెసిడెంట్ యూసుఫ్ అహ్మద్, ఇస్మాయిల్, జునేద్, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫంక్షన్ హాల్ ఓపెనింగ్ ముఖ్య అతిథులుగా బాన్సువాడ శాసన సభ్యులు వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు





బాన్సువాడ/మే 16/(జన సంఘర్షణ)

శనివారం తిమ్మాపూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్న స్వామివారి సన్నిధిలో బాన్సువాడ శాసన సభ్యులు వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి 28 మే 2026న ఎన్టీఆర్ జయంతి, మీర్జాపూర్ క్యాంప్ నందు గల ఫంక్షన్ హాల్ ఓపెనింగ్ గురించి ముఖ్య అతిథులుగా రావలసిందిగా ఆహ్వానించడం జరిగింది. అదేవిధంగా రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ కాసుల బాలరాజుని కూడా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దుప్పలపూడి శ్రీధర్, దమ్మలపాటి చౌదరి, పల్లెంపాటి శివరామకృష్ణయ్య, ఉప్పులూరు బాబురావు, కొల్లు రమేష్ బాబు, దమ్మాలపాటి ఉదయభాస్కర్, వేములపల్లి ఆనంద్, నార్ల సాయి శ్రీనివాస్, తొట్టెంపూడి శివ, నూతకి శ్రీనివాస్, నెక్కంటి రమేష్, రాంబాబు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ గుండా చంద్రయ్య మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం



ఆదిలాబాద్ జిల్లా జన్నారం/మే 16/(జన సంఘర్షణ)

ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ గుండా చంద్రయ్య మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వివిధ శాఖలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడిగా, ప్రభుత్వ న్యాయవాదిగా వారు న్యాయ రంగంలో విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన జస్టిస్ చంద్రయ్య సామాజిక అసమానతలు, మానవ హక్కుల ఉల్లంఘనల వంటి అంశాలపై అనేక చరిత్రాత్మక తీర్పులు వెలువరించినట్లు ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. వారి మరణం న్యాయ వ్యవస్థకు తీరని లోటు అని, జస్టిస్ చంద్రయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.

## కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కర పుష్కరాలు

- డిప్యూటీ సీఎంకు అహ్వానపత్రిక అందించిన మంత్రి కొండా సురేఖ





జయశంకర్ భూపాలపల్లి/మే 16/(జన సంఘర్షణ)

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్‌కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోచ్ఛారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
ఆదివారం
17 మే 2026

# జానకంపేట్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ సలహాదారు పి సుదర్శన్ రెడ్డి హామీ




ఎడపల్లి, మే,16: జన (సంఘర్షణ )
ఎడపల్లి మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తుల రద్దీ భారీగా నెలకొంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. జానకంపేట్ ఆలయానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని, ముఖ్యంగా అమావాస్య రోజున అష్టముఖి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తే దోషాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. అష్టముఖి కోనేరులో పేరుకుపోయిన పూడిక తొలగింపునకు నిధులు కేటాయించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలపై అధికారులతో చర్చించి మరిన్ని నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమావాస్య సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గుట్ట కింది ప్రాంతంలో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నాయకులు పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, మల్కా రెడ్డి, భాస్కర్ రెడ్డి, కామప్ప, గ్రామ సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, విజయ్ గౌడ్, మిద్దె చిన్నయ్య, ఆలయ ఈఓ వేణు తదితరులు పాల్గొన్నారు.

# టౌన్ 6 పిఎస్ పరిధిలో పేకాట స్థావరంపై చీత ఫోర్స్ మెరుపు దాడి

- పోలీస్ కమీషనర్ వెల్లడి

నిజామాబాద్ సిటీ. మే 16 ( జన సంఘర్షణ )
నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్న నేపథ్యంలో సి.సి.ఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీత ఫోర్స్ సిబ్బంది నేడు 6 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ ప్రాంతంలో, జిల్లా జైలు పక్కన నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో చీత ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టగా, కొందరు వ్యక్తులు బహిరంగంగా పేకాట ఆడుతూ కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, మొత్తం 5 మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. దాడి సందర్భంగా వారి వద్ద నుండి 3 సెల్ ఫోన్లు, రూ. 12,530/- నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన వ్యక్తులను స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం 6 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో పేకాట, గుట్కా, గంజాయి, డ్రగ్స్, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట, గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీస్ శాఖ సూచించింది.



# నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 1 వారంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 169


- నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 1 వారంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 169.
- నమోదు జరిమానా 10,80,000/- విధించిన సంబంధిత కోర్టులు పోలీస్ కమిషనర్ వెల్లడి.




నిజాంబాద్ సిటీ.. మే 16. ( జన సంఘర్షణ )
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 1 వారంలో డ్రంకన్ డ్రైవ్ లో 169 మంది పట్టు బడగా వారిని నిజామాబాదు , బోధన్, అర్మూర్ కోర్టులలో వారిని హాజరు పర్చగా ఇందులో 07 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికి 10,80,000/- జరిమానా విధించనైనది. కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తములో త్రాగి వాహనములు నడిపి పోలీస్ వారికి పట్టుబడటం జరుగుచున్నది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగముగా తేది:11-5-2026 నుండి తేది: 16-5-2026 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 169 కేసుల నమోదు చేయడం జరిగింది. నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య గమనికలు తెలియజేయడం జరిగింది. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు. వాహనాదారులు వాహనానికి సంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరు. డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడును. మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ మరియు వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడును అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదు. ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడును. మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ - 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడును. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడును.

# బండి సంజయ్ తల్లి ఆరోగ్య పరిస్థితి

- శుక్రవారం కరీంనగర్‌లోని నివాసంలో గుండెపోటు
- వెంటనే హైదరాబాద్ గచ్చిబౌలిలోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలింపు
- యాంజియోప్లాస్టీ చేసినట్లు సమాచారం. వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు
- ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సన్నిహిత వర్గాలు తెలిపాయి



కరీంనగర్/మే 16/(జన సంఘర్షణ)
గత మూడు రోజులుగా సోషల్ మీడియాలో 'బండి భగీరథ కేసు'కు సంబంధించి జరుగుతున్న దుష్ప్రచారంతో శకుంతల తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. నిరంతరం వస్తున్న నెగటివ్ ప్రచారం, తప్పుడు కథనాలు ఆమె మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆసుపత్రికి చేరుకుని వైద్యులతో ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

# రైల్వే గేటు బంద్.. పదేళ్లుగా ప్రజా శ్వాసకు బ్రేక్



కొత్తగూడెం మే 16 (జన సంఘర్షణ)
కొత్తగూడెం పట్టణంలోని రాజీవ్ పార్క్, నెహ్రూ బస్తీ వద్ద మూసివేసిన రైల్వే గేటు స్థానంలో తక్షణమే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బత్తుల శ్రీనివాస్, బొందుగుల శ్రీధర్, సయ్యద్ హైమద్, పిల్లి కుమార్ లు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు వినతిపత్రం సమర్పించారు. గత పదేళ్ల క్రితం రైల్వే అధికారులు తీసుకున్న ఏకపక్ష నిర్ణయం వల్ల రామటాకీస్ ఏరియా, సన్యాసి బస్తీ, మధుర బస్తీ, బూడిదగడ్డతో సహా దాదాపు పదికి పైగా బస్తీల ప్రజల దైనందిన జీవితాలు ఛిన్నభిన్నమవ్వడమే కాకుండా, అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లే దారి లేక ఎందరో ప్రాణాలు కోల్పోవడం అభివృద్ధి నమూనాలలోని వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. విద్యార్థులు, ఉద్యోగుల ప్రయాణ కష్టాలను రైల్వే శాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చినప్పటికీ రైల్వే ట్రాక్‌లు కేవలం నగరాలను అనుసంధానించడానికేనా, స్థానిక ప్రజల ప్రాణాలను హరించే గోడలుగా మారాలా అనే ఆలోచనను ఈ పదేళ్ల నిరంతర నిరీక్షణ రేకెత్తిస్తోంది.

## నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భరోసా

నారాయణఖేడ్/మే 16/(జన సంఘర్షణ)



కల్హేర్ మండల పరిధిలోని మర్డి గ్రామానికి చెందిన గుర్రపు భద్రయ్య నిన్న అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం చెప్పిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి. వారితో పాటు మార్డి గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లపల్లిలో న్యూడెమోక్రసీ ఉప్పెన

- ఇంధన మంటలు - సామాన్యుడి కన్నీళ్లు

ఆళ్లపల్లి మే 16 (జన సంఘర్షణ)




అంతర్జాతీయ మార్కెట్ సమీకరణాల సాకుతో కేంద్ర ప్రభుత్వం నిరంతరం పెంచుకుంటూ పోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు.. నేడు సగటు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను కుదేలు చేస్తున్నాయి. పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా శనివారం ఆళ్లపల్లి మన్యం ప్రాంతం ప్రజా నిరసనతో రగిలిపోయింది. సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై భారీ ప్రదర్శన, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ పోరాటానికి సీనియర్ నాయకత్వం దిశా నిర్దేశం చేయగా, స్థానిక శ్రమజీవులు, అట్టడుగు వర్గాలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఆవేదనను నిరసన రూపంలో చాటారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణిలు కేంద్ర పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అనేది కేవలం వాహనదారులకు సంబంధించిన సమస్య కాదని, అది నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీసే ఒక 'ఆర్థిక గొలుసు చర్య' అని వారు విశ్లేషించారు. రవాణా ఛార్జీలు పెరగడం వల్ల మార్కెట్‌లో ప్రతీ వస్తువు ధర ఆకాశాన్ని తాకుతుందని, ఫలితంగా రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజలు తీవ్ర ఆర్థిక భారంతో నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం సామాన్యుడి రక్తాన్ని పిండే విధానాలను తక్షణమే విడనాడి, ఇంధన ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి బట్టు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ పోరాటంలో జిల్లా నాయకులు పూనెం రంగయ్యతో పాటు మెస్సు గోపాల్, అటికం శేఖర్, బొర్ర వెంకన్న వంటి క్షేత్రస్థాయి నాయకులు గొంతుకలిపారు. మన్యం గుండెల్లోంచి వచ్చిన ఈ నిరసన స్వరం.. కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు, అది పాలకుల నిర్లక్ష్యంపై సామాన్యుడు చేసిన తిరుగుబాటు అని ఈ ప్రదర్శన నిరూపించింది.

# ఎన్నికల ఉపశమనం.. ఆపై ధరల వాత



అశ్వాపురం మే 16 (జన సంఘర్షణ)
ప్రజాస్వామ్యంలో ఎన్నికలొస్తేనే పాలకులకు ప్రజలు గుర్తుకొస్తారా, ఓట్ల పండగ ముగియగానే సామాన్యుడిపై భారాల వాత పెట్టడం ఏ రకమైన రాజకీయం అనే ప్రశ్నలను రేకెత్తిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై అశ్వాపురంలో కాంగ్రెస్ శ్రేణులు నిప్పులు చెరిగాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియడమే ఆలస్యం, కేంద్రంలోని మోడీ సర్కార్ పెట్రోల్, డీజిల్‌లపై అదనంగా 3 రూపాయల భారాన్ని మోపడం పాలకుల నైతిక దిగజారుడుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఎన్నికలు అవ్వగానే బీజేపీ సర్కారు ధరలు పెంచుతుంది" అని రాహుల్ గాంధీ ముందుగా హెచ్చరించిన మాటలు నేడు అక్షరసత్యాలయ్యాయని, ఈ ఇంధన ధరల పెరుగుదల కేవలం ఇంధనానికి పరిమితం కాకుండా నిత్యావసరాల ధరలను పెంచి పేదవాడి నడ్డి విరుస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తురుమలగూడెం, సీతారామపురం, బట్టీలగుంపు సర్పంచ్‌లు కుంజా జాన్, సప్కా పిచ్చయ్య, సరితలతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు హాజరైన ఈ విలేకరుల సమావేశం.. సంక్షేమ పాలన అందించాల్సిన ప్రభుత్వాలు, కేవలం పన్నుల భారంతోనే ప్రజలను పిండేస్తున్నాయా అనే ఒక లోతైన సామాజిక ఆలోచనను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లింది.

# శిక్ష మార్పు కోసమే, జీవితాన్ని ముగించడానికి కాదు



ఇల్లందు మే 16 (జన సంఘర్షణ)
ఇల్లందు సబ్ జైలును స్థానిక కోర్టు న్యాయమూర్తి స్వరూప కాటం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల వసతులు, వంటశాల పరిశుభ్రత మరియు రికార్డులను పరిశీలించిన ఆమె, ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని పిలుపునిచ్చారు. లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తి కార్తిక్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరుల సమక్షంలో జరిగిన ఈ తనిఖీ కేవలం ఒక అధికారిక ప్రక్రియ మాత్రమే కాదు. తప్పు చేసి జైలుపాలైన వ్యక్తుల్లో పరివర్తన తీసుకురావడానికి, వారి మానవ హక్కులను కాపాడటానికి వ్యవస్థ చేస్తున్న ఒక నిరంతర ప్రయత్నానికి ఇది నిదర్శనం. చట్టం దృష్టిలో జైలు అనేది కేవలం శిక్షాస్మృతి మాత్రమే కాదు, అదొక సంస్కరణాలయం; కాబట్టి ఖైదీలు ఇక్కడి సమయాన్ని పశ్చాత్తాపంతో, స్వీయ పరిశీలనతో గడుపుతూ సమాజంలోకి మళ్లీ బాధ్యతాయుతమైన పౌరులుగా అడుగుపెట్టాలనే ఆలోచనను ఈ పర్యటన మరోసారి రేకెత్తించింది.

## బొగ్గు వెలుగుల వెనుక.. శ్రమజీవుల భవిష్యత్తుపై సదస్సులు

◆ **సింగరేణి 'మణుగూరు' విస్తరణ**

ఇల్లందు మే 16 (జన సంఘర్షణ)




సింగరేణి సంస్థ కేవలం లాభాల బాటలోనే కాదు.. భవిష్యత్తు ప్రణాళికల్లోనూ సరికొత్త రికార్డుల వైపు అడుగులు వేస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను 2.10 మిలియన్ టన్నుల భారీ సామర్థ్యంతో మణుగూరు ఓపెన్ కాస్ట్ (ఓసీ) విస్తరణ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా ప్రారంభించ బోతున్న తరుణంలో, సంస్థ ప్రగతి-భవిష్యత్ లక్ష్యాలపై ఈ నెల 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్ పర్యవేక్షణలో, అధికారులు, కార్మిక సంఘాల నేతల సమక్షంలో జరగబోయే ఈ సదస్సులు కేవలం అంకెలు, లక్ష్యాల సమీక్ష మాత్రమే కాదు; నల్లబంగారపు సామ్రాజ్యాన్ని శాసిస్తున్న శ్రమజీవులను సంస్థ అభివృద్ధిలో చురుకైన భాగస్వాములను చేసే ఒక ఆలోచనాత్మక వేదిక. భూగర్భ గనుల నుంచి ఓపెన్ కాస్ట్‌ల విస్తరణ వైపు పయనిస్తున్న ఈ ప్రయాణంలో.. యాజమాన్య లక్ష్యాలు, కార్మికుల సంక్షేమం, పర్యావరణ సమతుల్యత అనే మూడు ముక్కల బంధాన్ని ఈ సదస్సులు ఎంతవరకు సమన్వయం చేస్తాయనేది ఇప్పుడు పరిశ్రమ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. సంపద సృష్టితో పాటు శ్రామిక శక్తే సంస్థకు అసలైన పెట్టుబడి అని గుర్తుచేసేలా సాగనున్న ఈ సదస్సుల ఫలితాలపైనే మణుగూరు ఏరియా భవితవ్యం ఆధారపడి ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కామారెడ్డి జిల్లా ప్రో కబడ్డీ లీగ్ ప్రారంభోత్సవం

◆ **ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు.**



ఉమ్మడి జిల్లల/బాన్సువాడ/మే 16/(జన సంఘర్షణ)

బాన్సువాడ పట్టణ పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సీనియర్స్ మహిళల, కామారెడ్డి జిల్లా పురుషుల కామారెడ్డి జిల్లా ప్రో కబడ్డీ లీగ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు. ఈ సందర్భంగా గ్రామాలలో దాగి ఉన్న ప్రతిభావంతులైన కబడ్డీ క్రీడాకారులను వెలికితీసి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కామారెడ్డి జిల్లా ప్రో కబడ్డీ లీగ్ ఆర్గనైజర్ రాజుని అభినందించిన పోచారం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు తరతురులు పాల్గొన్నారు.

## ఆశల 'ఆయకట్టు': పినపాక సాగునీటి కలలు.. సమీక్షల గడప దాటి పొలాలకు చేరేనా?

పినపాక 16 (జన సంఘర్షణ)



దశాబ్దాలుగా వర్షాభావ పరిస్థితులతో, సాగునీటి కొరతతో అల్లాడుతున్న పినపాక నియోజకవర్గ రైతాంగం ముఖాల్లో సంతోషం నింపడమే లక్ష్యంగా.. మంత్రి పొంగిలేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం రాజకీయ వర్గాల్లో, క్షేత్రస్థాయిలో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది. పులుసుబొంత అటవీ అనుమతుల అడ్డంకులు, రేగులగండి అదనపు నిధుల అవసరాలు, 16 వేల ఎకరాల సామర్థ్యం గల మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ లెఫ్ట్ కెనాల్ పెండింగ్ పనులు, మరియు బూర్గంపాడు దోమలవాగు మినీ రిజర్వాయర్ భూసేకరణ వంటి కీలక సవాళ్లపై ప్రజా ప్రభుత్వం 'యుద్ధప్రాతిపదికన' కదులుతున్నట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రకటించడం అభినందనీయం; అయితే, కాగితాలపై సాగే ఉన్నత స్థాయి సమీక్షలు, నిధుల మంజూరు ఆదేశాలు.. క్షేత్రస్థాయిలో ఎర్రటి ఎండలకు ఎండిపోతున్న చివరి ఆయకట్టు రైతు చేనుకు త్వరితగతిన నీరు అందించగలిగినప్పుడే ప్రజా ప్రభుత్వ సంకల్పానికి, అధికారుల సమన్వయానికి నిజమైన సార్థకత చేకూరుతుందనేది పాలకులు గుర్తించాల్సిన ముమ్మాటికీ ఆలోచనాత్మక వాస్తవం.

## నిజామాబాద్ ప్రజలు ఈ దిగువ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలి

◆ **పోలీస్ కమిషనర్ వెల్లడి**

నిజామాబాద్ సిటీ. మే 16. ( జన సంఘర్షణ )



**విగ్రహాల ప్రతిష్టాపన:-** ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదు, ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలోని కమిటీ యొక్క అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది.

**శబ్ద కాలుష్యం నియంత్రణ:-** ఎక్కువశబ్దంతో డి.జే లను ఏర్పాటుచేయరాదని, ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదు. పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి.

**ఊరేగింపులు, సభల నిర్వహణ:-** ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి. జేలు. సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో నిషేదం గలదు. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి.

**సార్వజనిక ప్రదేశాల్లో నియమాలు:-** మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటి నిబంధనలు తప్పనిసరి పాటించాలి. ప్రతీ ఒక్కరు క్యూ పద్ధతిని తప్పనిసరి పాటించాలి.

**డ్రోన్ల వినియోగం పై ఆంక్షలు:-** డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపద్యంలో నియంత్రణ చర్యలు తీసుకోవడం జరగుతుందని, ఈ డ్రోన్ల ఉపయోగం వలన జనజీవనానికి విఘాతం కలగడమే కాకుండా శాంతి భద్రతలకి విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ,ఎవరయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రారంభించదలచినచో ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు మరియు ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి.

**నకిలీ గల్ఫ్ ఏజెంట్ల నుండి అప్రమత్తం:-** జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్ పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనదికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ,అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. కావున జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందుజాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి తెలియజేయండి. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

**' ఎ ' సర్టిఫికెట్ ఉన్న సినిమాల వీక్షణం:-** నిజామాబాద్ జిల్లాలో ' ఎ ' (పెద్దలు) సర్టిఫికేట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి థియేటర్లను అనుమతించరాదు.

**బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం:-** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీదుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరమైన వికృత అసభ్యకరమైన ప్రవర్తనను ప్రదర్శిస్తున్నట్లు నివేధికలు సూచిస్తున్నాయి. సాధారణంగా రోడ్డు వినియోగదారులకు ముఖ్యంగా మహిళలు, పిల్లలకు చికాకు ఆటంకము కలిగించి ప్రజా ప్రశాంతతకు దారితీస్తుంది. కావున బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీచేయడం జరిగింది.

ముఖ్యగమనిక :- పైన తెలియజేసిన నిబంధనలను ఎవ్వరయిన అతిక్రమించినయెడల వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడానికి నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు / ఎస్.ఐ లకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అధికార ఉత్తర్వులను జారీచేయడం జరిగింది. ఇట్టి ఉత్తర్వులు తేది:16-05-2026 నుండి తేది:31-05-2026 వరకు అమలులో ఉంటుంది. కావున ప్రజలందరూ సంబంధిత పోలీస్ అధికారులకు సహకరించగలరు.

## యాసంగి 2025-26 సీజన్‌లో మక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్

కామారెడ్డి/ మే 16/(జన సంఘర్షణ)

యాసంగి 2025-26 సీజన్‌లో జిల్లాలో కొనసాగుతున్న మక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం శనివారం తన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, డి.ఎం., వేర్‌హౌస్ మేనేజర్లు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు తీసుకువస్తున్న మక్కజొన్నను వేగవంతంగా కొనుగోలు చేసి, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అధికారికి మండలాల వారీగా కొనుగోలు చేయాల్సిన మక్కజొన్న నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా సొసైటీ స్థాయిలో హమాలీల సంఖ్యను పెంచి, కొనుగోలు చేసిన మక్కజొన్న నిల్వలను ప్రతిరోజూ గిడ్డంగులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజినల్ మేనేజర్‌కు ఇప్పటికే గుర్తించిన గోడౌన్లను వెంటనే స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల సంఖ్యను పెంచి, ప్రతిరోజూ వాహనాలను పూర్తిస్థాయిలో అన్‌లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లను గుర్తించి స్టోరేజ్ స్పేస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కూడా సూచించారు.లారీ రవాణా కాంట్రాక్టర్‌కు అవసరమైన లారీల సంఖ్యను పెంచి, మక్కజొన్న రవాణా ప్రక్రియ ఎటువంటి ఆలస్యం



లేకుండా నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ మరియు సంబంధిత అధికారులకు జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం గల గోడౌన్లను గుర్తించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే డి.ఎం. మార్కెట్ ఫెడ్ అదనపు కలెక్టర్‌కు జిల్లాలో మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## గంజాయి, మత్తుపదార్థాల వినియోగదారులకు డ్రగ్స్ కేసులలో పట్టుబడిన వారికి రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీస్ కమిషనర్

◆ **మళ్లీ పునరావృతం అవుతే పి.డి యాక్టు తప్పదు అని హెచ్చరిక**

నిజామాబాద్ సిటీ. మే 16. ( జన సంఘర్షణ )

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేడు జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ టీం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమము నేడు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో గతంలో గంజాయి, డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు, రౌడీ షీటర్లు, అనుమానితులను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు.



ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, కుటుంబాలు ఆర్థికంగా మరియు సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం ఆరోగ్యపరంగా ప్రమాదకరమేకాకుండా చట్టపరంగా కూడా తీవ్రమైన నేరమని, ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదైన వ్యక్తులు తమ ప్రవర్తన మార్చుకొని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని, మళ్లీ ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగుతుందని, విద్యాసంస్థలు, హాస్టళ్లు, పబ్లిక్ ప్రదేశాల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య , ఉపాధి, కుటుంబ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తమ పరిసరాల్లో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం ఈగల్ టీం , పోలీస్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అనుమానితులకు డ్రగ్స్ పరీక్షలు చేపట్టారు. ఈ పరీక్షల్లో కొంతమంది వ్యక్తులకు డ్రగ్స్ వినియోగం పాజిటివ్‌గా తేలడంతో వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ అదనపు డీసీపీ (ఏ.ఆర్) రామ్ చంద్రరావు, నిజామాబాద్ ఏసీపి ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, లీగల్ టీం డీఎస్పీ





ఎం. సోమనాథం, హోమ్ గార్డ్ ఏసిపి కె. దీపక్ చంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీనివాస రాజ్, సౌత్ రూరల్ సిఐ ఎన్. సురేష్ కుమార్, నార్త్ రూరల్ సీఐ బి. శ్రీనివాస్, డిచ్పల్లి సిఐ కె. వినోద్, ధర్పల్లి సిఐ బిక్షపతి, నిజామాబాద్ డివిజన్ ఎస్.హెచ్.ఓ లు, ఎస్ఐలు తదితరులు పాల్గొనడం జరిగింది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
17 మే 2026

# దొడ్డు ధాన్యం మాకొద్దు.. లారీల ధాన్యం తీసుకోవడానికి రైస్ మిల్లర్ నిరాకరణ

**◆ రోడ్లపై లారీలను పెట్టి రాకపోకలకు అంతరాయం**

నిజాంసాగర్ /మే 16/(జనసంఘర్షణ)

రైతు పంట పండించడానికి నాలుగు నెలలు చలి, గాలి, వర్షం అనే లెక్కచేయకుండా అరకాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్ముకుందామంటే రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు వేగవంతం చేయాలంటూ అన్నదాతలు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు, మరొకపక్క మొక్కజొన్న, జొన్న, శనిగ కొనుగోళ్లు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. అరకాలం శ్రమించి పండించిన పంటను కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో గల యూనిఫైడ్ రైస్ మిల్ ధాన్యం లారీలు వచ్చి వారం రోజులు అవుతున్న ఆ ధాన్యం కొనుగోలు చేయడానికి రైస్మిల్ యజమాని ముందుకు రాకపోవడం వల్ల. వారం రోజుల నుంచి రైస్ మిల్ ముందు నిరీక్షించిన లారీలను లారీల డ్రైవర్లు, రైస్ మిల్ యజమాని నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధాన్యం లారీలను రహదారిపై అడ్డంగా పెట్టి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన దొడ్డు ధాన్యం తీసుకోవాలని ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి గ్రామ శివారులోని యూనిఫైడ్ రైస్ మిల్క్ అనుమతులు ఇవ్వగా. దొడ్డు ధాన్యం తీసుకోవడం సాధ్యం కాదంటూ రైస్ మిల్ యజమాని మొండిపట్టు పట్టారు. ప్రభుత్వం ఈ రైస్ మిల్క ధాన్యం అలాట్మెంట్ చేసినప్పటికీ దొడ్డు ధాన్యం తాను తీసుకోనని రైస్ మిల్ యజమాని భీష్మంచుకొని కూర్చున్నారు. దీనిని నిరసిస్తూ వారం రోజులుగా రైస్ మల్ ముందు వరుస క్రమంలో ఉన్న దాన్యం లారీలను ప్రధాన రహదారిపై అడ్డంగా పెట్టి నిరసనకు దిగడంతో రాత్రి వేళలో హైదరాబాద్ నుంచి బాన్సువాడకు వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తమ ధాన్యం తీసుకునే వరకు లారీలను రోడ్డుపై నుంచి కదిలించలేలేదని లారీ డ్రైవర్లు మొండి పట్టుకుని కూర్చున్నారు. మరొక పక్క దొడ్డు ధాన్యం తాము తీసుకునేలేదని రైస్ మిల్ యజమాని రైతులకు కరాకండిగా వెల్లడిస్తున్నారు. వారం రోజులుగా కాటా



పెట్టిన ధాన్యం ఇప్పుడు ప్రతి లారీకి 6 నుంచి 10 క్వింటాళ్ల ధాన్యం తరుగు వస్తుందని రైతులు వెల్లడిస్తున్నారు. అయినప్పటికీ రైస్ మిల్ యజమాని దొడ్డు ధాన్యం తీసుకోను అంటూ భీష్మించుకొని కూర్చున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని దొడ్డు ధాన్యం రైస్ మిల్లులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయాలంటూ రైతులు కోరుతున్నారు. లేనియెడల రైతుల అందరం కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్లి తమ గోడు వినిపించుకుంటామని రైతులు వెల్లడించారు. అంతేకాకుండా తమ ధాన్యం తీసుకొని రైస్ మిల్లు తక్షణం సీజ్ చేయాలంటూ రైతులు డిమాండ్ చేశారు. శనివారంరాత్రి 10 గంటల వరకు ధాన్యం లారీలను ప్రధాన రహదారిపై పెట్టి నిరసన వ్యక్తం చేశారు.

# రూ.35 వేల లంచంతో ఏసీబీకి అడ్డంగా దొరికిన లైన్ మెన్

**◆ రూ.35 వేల లంచంతో ఏసీబీకి అడ్డంగా దొరికిన లైన్ మెన్**

యాదాద్రి భువనగిరి జిల్లా/మే 16/(జన సంఘర్షణ)

యాదాద్రి భువనగిరి జిల్లాలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్ మెన్ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. మోటకొండూరు మండలంలోని మేడికుంటపల్లి గ్రామానికి చెందిన రైతు అనంతరెడ్డి.. తన వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని అధికారుల చుట్టూ తిరిగాడు. ఇందుకోసం మూడు నెలల క్రితమే రూ.30 వేల డీడీలు కూడా చెల్లించాడు. అయినా ఫలితం లేకపోవడంతో.. ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలంటూ పలుమార్లు ఏఈ, అసిస్టెంట్ లైన్మెన్లను వేడుకున్నాడు. పని పూర్తయ్యాక రూ.10 వేల ఇస్తానని కూడా చెప్పాడు. కానీ.. లంచం ఇస్తేనే పని జరుగుతుందంటూ అసిస్టెంట్ లైన్మెన్ రమేష్ పట్టుబట్టాడు.ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలంటే ఏకంగా 35




వేల రూపాయల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లైన్మెన్ వేధింపులతో విసిగిపోయిన రైతు అనంతరెడ్డి.. రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రైతు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు..రెండు రోజులుగా పక్కా వ్యూహంతో రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలో, అనంతరెడ్డి నివాసం వద్ద లైన్మెన్ రమేష్ 35 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లంచం అడిగితే సహించేది లేదని, బాధితులు ఎవరైనా ఉంటే ఏసీబీని ఆశ్రయించాలని అధికారులు స్పష్టం చేశారు.

# చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో బాల్‌భవన్ పాత్ర గొప్పది: కలెక్టర్



నిజామాబాద్/మే 16/(జన సంఘర్షణ/

చిన్నారుల్లో సృజనాత్మకతకు వెలికితీయడంలో బాల్‌భవన్ పాత్ర గొప్పదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం 'కళా వైభవం - కలర్స్ ఆఫ్ చైల్డ్ హుడ్' కార్యక్రమాన్ని నిర్వహించగా కలెక్టర్, మేయర్ ఉమారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేసవిలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు వారికి ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు.

**కళాకృతులను తిలకించి.. బహుమతులిచ్చి..**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్.. చిన్నారులు తయారు చేసిన కళాకృతులు, గీసిన చిత్రాలను ఆసక్తితో తిలకించారు. చక్కటి పెయింటింగ్స్ గీసిన 7వ తరగతి విద్యార్థి సాయి రుధిర్ కళా నైపుణ్యాన్ని కలెక్టర్ మెచ్చుకుంటూ, చిన్నారికి బహుమతిని అందించి ప్రోత్సహించారు. పేరిణి, కోలాటం నృత్యాలతో అలరింపజేసిన చిన్నారులను, వెంట్రిలాక్విజంతో ఆకట్టుకున్న జాదూ యుగంధర్ రంగనాథ్‌ను సైతం కలెక్టర్ ప్రశంసించారు. ప్రస్తుత వేసవి శిక్షణ తరగతుల్లో బాల్? భవన్?లో 720 మంది చిన్నారులకు ప్రవేశాలు కల్పించగా, వారికి అందిస్తున్న శిక్షణ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

**చిన్నారుల్లో కలిసిపోయి..**

సభా వేదిక దిగి కలెక్టర్ చిన్నారుల మధ్యకు వెళ్లి వారికి ఆయా అంశాలపై ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. చిన్నారులు అందరికీ చాక్లెట్లు పంచుతూ, ప్రతిభ చాటిన బాలబాలికలకు బహుమతులు అందించారు. బాలభవన్ ద్వారా చక్కటి శిక్షణ కార్యక్రమాలను



నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అభినందించారు. చిన్నారులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను బాల భవన్ లో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ ద్వారా పిల్లల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. మేయర్ ఉమారాణి మాట్లాడుతూ.. నేటి చదువులు ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉన్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లో బాల భవన్ ద్వారా అందిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలు చిన్నారులకు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, బాల్ భవన్ సూపరింటెండెంట్ ఉమాబాల, మాజీ పర్యవేక్షకుడు ప్రభాకర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద 108 అంబులెన్స్ సేవలు

**◆ ఎండలు దృష్టిలో పెట్టుకొని....**

పొతంగల్/మే 16/(జన సంఘర్షణ)



ఇంటర్ సప్లమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద అంబులెన్స్ సేవలు అందిస్తున్నారు. ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిమిత్తం వేసవికాలం, ఎండ ప్రభావం తీవ్రంగా ఉండడంతో విద్యార్థుల ఆరోగ్యా దృష్టి పట్ల పరీక్ష కేంద్రాల వద్ద అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలని, విద్యార్థులకు ఎటువంటి ఆటంకం కలగకుండా 108 సేవలు వినియోగించుకునేలా పరీక్ష కేంద్రాల సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంబులెన్స్ సేవలు పరీక్షా కేంద్రాల వద్ద వినియోగించుకునేలా ఏర్పాటు చేసింది. నిజాంబాద్ డిస్టిక్ కోటగిరి మండలం ప్రభుత్వ కళాశాల వద్ద పొతంగల్ అంబులెన్స్ సిబ్బంది టెక్నీషియన్ నారాయణ, పైలెట్ ఎండి కలీం పరీక్ష కేంద్రాల వద్ద ఉండి సేవలు అందించారు. నిజాంబాద్ సూపర్వైజర్ స్వరాజ్ ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్ పోతంగల్ 108 సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో ,పరీక్ష కేంద్రాల వద్ద సప్లమెంటరీ పరీక్ష కేంద్రాలు పూర్తయ్యే వరకు అంబులెన్స్ సేవలు అందించేలా చూడాలని ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, సూపర్వైజర్ స్వరాజ్ పోతంగల్ 108 సిబ్బందికి సూచించారు.

# పోలీసుల ముందు లొంగిపోయిన బండి భగీరథ్



కరీంనగర్/మే 16/(జన సంఘర్షణ)

బండి భగీరథపై నమోదైన పోక్సో కేసులో హైడ్రామాకు తెరపడింది. గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని తెలంగాణ హైకోర్టు తిరస్కరించడంతో పాటు, దేశం విడిచి వెళ్లకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. దీంతో న్యాయవాదుల సలహా మేరకు ఆయన పోలీసులకు సరెండర్ అయినట్లు సమాచారం. మైనర్ బాలికను వేధించారనే ఆరోపణలపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో పోక్సో చట్టం కింద కేసు భగీరథపై నమోదైంది.

# నిజామాబాద్‌లో భారీగా గంజాయి స్వాధీనం

నిజామాబాద్ /మే 16/(జన సంఘర్షణ)



నిజాంబాద్ జిల్లాలో కేంద్రంలో రైళ్లలో ప్రయాణికులను తనిఖీ చేస్తుండగా భారీగా మొత్తం గంజాయి పట్టుబడినట్లు నిజామాబాద్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. శనివారం ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో, ఆర్పీఎఫ్ బృందాలు సంయుక్తంగా నాగవల్లి ఎక్స్ప్రెస్ లో సోదాలు నిర్వహించగా మహారాష్ట్రకు చెందిన పూనంచంద్ శంకర్రావు చౌదరి వద్ద, రూ.1,33,750 విలువైన 5.35 చిరుల గంజాయి పట్టుకొని సీజ్ చేశారు. గంజాయిని విశాఖ పట్టణం నుంచి నాందేడ్‌కు తరలిస్తున్నట్టు చెప్పారు.

# శ్రీవారి సేవలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బీర్కూర్.,/మే 16/(జన సంఘర్షణ)



బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆలయ ధర్మకర్త, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి. కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్న బాన్సువాడ ఆర్డిఓ రవీందర్ రెడ్డి, తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి స్వామి వారి దర్శనం కొరకు వచ్చే భక్తులు దేవాలయం తరపున ఏర్పాటు చేసిన ఉచిత రవాణా సదుపాయం ఉపయోగించుకోవాలని తెలిపిన పోచారం దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, వికలాంగులు, పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొండ కింద నుండి కొండ పైన దేవస్థానం వరకు దేవస్థానం తరపున ఉచిత వాహనం అందుబాటులో ఉంటుందని తెలిపారు. భక్తులకు ఈ విషయంలో ప్రాచుర్యం కల్పించడానికి శనివారం పోచారం స్వయంగా వాహనాన్ని కొండ కింద నుండి కొండ పైకి, తిరిగి కొండ పై నుండి కింద వరకు నాలుగు ట్రిప్పులు వేసి భక్తులను చేరవేశారు.ఈ సందర్భంగా పోచారం భక్తులతో మాట్లాడుతూ మీ తోటి భక్తులు ఈ ఉచిత రవాణా సదుపాయన్ని వినియోగించికోవాలని, ఇతరులకు ఈ సమాచారాన్ని చేరవేయాలని తెలిపారు తమ సౌకర్యార్థం ఉచితంగా ఏర్పాటు చేసిన ఈ రవాణా సదుపాయనికి పోచారంకు ఆలయ కమిటీకి భక్తులు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు తిమ్మాపూర్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శని జయంతి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్ :**





ఉప్పల్ రింగ్ రోడ్ సమీపంలోని శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయంలో శని జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక తైలాభిషేకాలు, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు దేవాలయ నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భక్తులతో కలిసి శని దేవునికి నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాష్ట్ర ప్రజలందరికీ శుభసమృద్ధులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై జలమండలి అధికారికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్**

రామంతాపూర్ డివిజన్లో తాగునీరు, మురుగునీటి సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు పాల్గొన్నారు. రామంతాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్, ఎండోమెంట్ కాలనీ, రాంశంకర్ నగర్, గాంధీనగర్, శ్రీరామకాలనీ, గణేష్ నగర్, నేతాజీ నగర్, రాజేంద్రనగర్, ప్రగతి నగర్, గోఖలే నగర్ తదితర ప్రాంతాల్లో పాడైపోయిన మురుగునీటి పైప్లైన్ల పునర్నిర్మాణం, కొత్త మురుగునీటి లైన్ల ఏర్పాటు, పాత తాగునీటి పైప్లైన్ల స్థానంలో కొత్త లైన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే సమర్పించారు. అలాగే రామంతాపూర్ పరిధిలో తరచుగా నీటి కాలుష్య సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాల్లో పాత తాగునీటి పైప్లైన్ల స్థానంలో కొత్త నీటి సరఫరా లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అభివృద్ధి పనుల మొత్తం అంచనా వ్యయం రూ.2 కోట్ల 57 లక్షలుగా ప్రతిపాదించారు. వినతి పత్రంపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్**



ఉప్పల్ బాగాయత్లోని కాల భైరవ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాల భైరవ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులందరికీ ఆయురారోగ్యాలు కలగడంతో పాటు వారి కోరికలు నెరవేరాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి ప్రత్యేక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ

**హనుమకొండ :**

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణను ఆనుకుని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. TUWJ(IJU) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కే విరాహత్ అలీ, రాంనారాయణలు రాజ్యంగ నిర్మాత విగ్రహావిష్కరణ కోసం భూమి పూజ నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు సొంత డబ్బులతో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. త్వరలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర బాధ్యులు కంకణాల సంతోష్, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, కార్యదర్శి తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కొశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రెటరీ, పొడికొట్టి విష్ణువర్ధన్, ఎండీ నయీంపాషా యూనియన్ నాయకులు, జర్నలిస్టులు, పాల్గొన్నారు.

## శ్రీ శివ శంకర మహా మాయి దేవాలయంలో విశేష పూజలు

**-భక్తులకు అన్నప్రసాద వితరణ**









**ఉప్పల్:**

ఉప్పల్లోని శ్రీశివ శంకర మహా మాయి దేవాలయంలో చైత్ర మాస అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందుతూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు ఉప్పొజి బలవంత చారి, బిక్షపతి, రాజగోపాల చారి, మధు, విజయ్, పవన్, చోల్లేటి శ్రీనివాస్, శ్రీధర చారి, పాలేర్ల గోపి, పాలకూర్ష దిలీప్, తీగ విట్టల్ రావు, శామీర్పేట హనుమంత్ రెడ్డి, ఏసురి యాదగిరి, కృష్ణారెడ్డి, గొంది ప్రశాంత్ రెడ్డి, జగన్, నర్సింహారెడ్డి, అభిరామ్, నవీన్, ముదుగొండ రావి, ప్రవీణ్ రెడ్డి, నర్సింహారావు, కొత్తకొండ రమేష్, తురాయి దాస్, మహేష్, రామ్ ప్రకాష్, గోపిచారి, పసుపునేటి రమేష్, వెంకటయ్య, కుమార్, భాస్కర్, చారి, నవీన్ గౌడ్, రాజు, సందీప్, మహేష్ కుమార్, ప్రశాంత్ కుమార్, పవన్ కుమార్, భవాని శంకర్, లక్ష్మణ్, సంతోష్ కుమార్, బంటి, శ్రీను, శ్రీనివాస్ గౌడ్, గణేష్ గౌడ్, యది గౌడ్, వెంకటేష్ తదితర భక్తులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టుల అభ్యున్నతికి నేనెప్పుడూ అండగా ఉంటా..

**జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి చేకూర్చే కృషి చేస్తా**

**-టీయూడబ్ల్యూజే-ఐజేయూ మహా సభలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని..**

**హనుమకొండ**





హనుమకొండ జిల్లా వర్కింగ్ జర్నలిస్టులకు నావంతుగా ఎల్లప్పుడు అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో జరిగిన టీయూడబ్ల్యూజే-ఐజేయూ మహా సభకు కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యత జర్నలిస్టులపై ఉందని పేర్కొన్నారు. కష్టనష్టాలను ఎదుర్కొంటూ ప్రజల కోసం పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జిల్లా జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్య భద్రత, ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్ తదితర అంశాల్లో తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా నాయకులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని ఘనంగా సన్మానించి, జర్నలిస్టుల పట్ల చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. అంతక ముందు విధి నిర్వహణలో పలు కారణాల చేత మృతి చెందిన జర్నలిస్టుల మౌనం వహిస్తూ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతికి విశ్వామిత్ర చౌహాన్ చేస్తున్న సేవలు అమోఘం- మేయర్

**విశ్వామిత్ర చౌహాన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేషన్ అధికారులు**

**సుజాతనగర్ :**





పర్యావరణ పరిరక్షణ కొరకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తూ వాక్ ఫర్ ట్రీస్ చెట్లకై నడక అనే నినాదం తీసుకొని తన సొంత ఖర్చులతో వృక్షజాతికి చెందిన మొక్కలను కొనుగోలు చేస్తూ 1444 రోజులుగా ప్రతిరోజు మొక్కలు నాటుతూ నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం తన పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి విశ్వామిత్ర చౌహాన్ ఏడు వసంతాలు పూర్తిచేసుకుని 8వ వసంతం లో అడుగుపెడుతున్న సందర్భంగా తన పుట్టినరోజు మే 16 కావడంతో వినూత్నంగా సుజాతనగర్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణంలో కొత్తగూడెం నగరపాలక మేయర్ మూడ్ గణేష్, తో కలిసి 16 వృక్షజాతికి చెందిన మొక్కలను నాటి ప్రకృతి పట్ల తనకున్న మక్కువను చాటుకున్నాడు. అనంతరం కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ఒకరి బాధ్యతే కాదు యావత్ సమాజం భాగస్వామ్యం కావాల్సిన సామాజిక యజ్ఞం అని వాక్ ఫర్ ట్రీస్ కాన్సెప్ట్ తీసుకొని మొక్కలు నాటే యజ్ఞాన్ని ముందుకు తీసుకెళుతున్న విశ్వామిత్ర చౌహాన్ అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. చౌహాన్ ను శాలువతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. పరిశుభ్రమైన నగరాలు భవిష్యత్తు తరాలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు సమాజానికి ఉపయోగపడే మొక్కలు నాటే యజ్ఞంలో భాగస్వాములు అవ్వాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల పని మాత్రమే కాదని సమిష్టి బాధ్యత అని ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా మారినప్పుడే కాలుష్య రహిత వాతావరణాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి బట్ట సంచులను వినియోగించాలని, ప్లాస్టిక్ వల్ల భూమికి, మూగజీవాలకు జరిగే నష్టాన్ని వివరించి ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ ను నిర్మూలించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పట్టణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలకు మద్దతునివ్వాలని కోరారు. నీటిని వృథా చేయకుండా ఆదా చేయడం విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, సౌరశక్తిని ప్రోత్సహించడం వంటి అంశాలపై అవగాహన పెంచుకొని వనరులను సంరక్షించుకోవాలన్నారు. చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని రీసైక్లింగ్ విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంఘీభావం

**కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ**

**ఉప్పల్ /. :**



కాప్రా జోన్ పరిధిలోని పద్మశాలి టౌన్షిప్లో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అమావాస్య రోజు నుంచి చేపట్టిన సమ్మెలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి రావాల్సిన న్యాయబద్ధమైన హక్కులు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందించాలని, అలాగే 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రతి కార్మికుడికి పెన్షన్ అందించేలా ప్రభుత్వానికి తన వంతు నివేదిక సమర్పిస్తానని హామీ ఇచ్చారు.

# పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం

- అశ్వారావుపేట అభివృద్ధికి జీవితాంతం కట్టుబడి ఉంటా
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ







**అశ్వారావుపేట :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ప్రభుత్వ హార్టికల్చర్ కళాశాలను ప్రారంభించిన అనంతరం అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదిహేను జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ రైతులు ఆయిల్ ఫెడ్ అధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రజాప్రతినిధులు రైతు సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సమ్మేళనం ప్రారంభానికి ముందు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, రైతులు నాయకులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ బృందాల నృత్యాలు డప్పు కళాకారుల ప్రదర్శనలు గిరిజన మహిళల హారతులతో సభా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది అనంతరం రైతులు ప్రముఖులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని ప్రత్యేక డిజిటల్ ప్రదర్శన రూపంలో సభలో ప్రదర్శించారు. ఆయన ప్రజా జీవితం రైతు సంక్షేమం కోసం చేసిన పోరాటాలు సాగునీటి ప్రాజెక్టులు రహదారుల అభివృద్ధి విద్యా సంస్థల ఏర్పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలను వీడియో రూపంలో ప్రదర్శన చేశారు. సభలో ప్రసంగించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,భావోద్వేగానికి లోనయ్యారు. “గత 50 సంవత్సరాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా నన్ను రాజకీయంగా నడిపించిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనం చేస్తున్నాను. ప్రజల ఆశీస్సులు లేకపోతే నేను ఈ స్థాయికి చేరుకునే వాడిని కాదు. జీవితాంతం ప్రజలకు రుణపడి ఉంటాను అన్నారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజల ప్రేమ, ఆదరణ శాశ్వతమని పేర్కొన్నారు.అభివృద్ధే తన రాజకీయ జీవిత ధ్యేయమని స్పష్టం చేసిన మంత్రి, ఒకప్పుడు సైకిల్ కూడా వెళ్లలేని రహదారులపై నేడు ఆధునిక వాహనాలు తిరుగుతున్నాయంటే అది ప్రాంత అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. సాగునీరు, రహదారులు, విద్య, వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు చేరువ కావడం వల్లే అభివృద్ధి సాధ్యమైందన్నారు.గిరిజన ప్రాంతాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జీఓ నెంబర్--3 కీలకపాత్ర పోషించిందని, ఆ ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేనని అన్నారు. గిరిజన యువత చదువులో, ఉపాధిలో ముందుకు రావాలని కోరారు.అశ్వారావుపేట ప్రాంత వ్యవసాయ సామర్థ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన మంత్రి, “భారతదేశంలో ఎక్కడ పండే పంట అయినా అశ్వారావుపేటలో పండుతుంది. ఇక్కడి నేల ఎంతో సారవంతమైనది. రైతులు కష్టపడే స్వభావం కలిగిన వారు కొనియాడారు. రైతుల ఆదాయం పెంచడం కోసం శాస్త్రీయ వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగు, మార్కెట్ ఆధారిత వ్యవసాయ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.హార్టికల్చర్ కళాశాల ఏర్పాటు వెనుక ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరిస్తూ, యువతకు ఆధునిక వ్యవసాయ విద్య అందించడం ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కళాశాలలో పరిశోధనలు, ప్రాక్టికల్ శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు ఉపయోగపడే కొత్త విధానాలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.ప్రపంచ మార్కెట్లో ఏ పంటకు అధిక డిమాండ్ ఉంటే రైతులు ఆ పంటను సాగు చేయాలని మంత్రి సూచించారు. మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగు చేస్తే రైతులు ఆర్థికంగా మరింత బలపడతారని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని, రైతులకు నాణ్యమైన మొక్కలు, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట ప్రాంతాన్ని వ్యవసాయ రంగంలో ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని, ఉద్యానవన కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత భవిష్యత్తును మార్చే కీలక అడుగని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సభలో పాల్గొన్న ఆయిల్ ఫెడ్ అధికారులు ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని వివరించారు.పామాయిల్ సాగులో ఆధునిక పద్ధతులు, దిగుబడి పెంపు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పలువురు రైతులు తమ అనుభవాలను సభలో పంచుకొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ఆయిల్ ఫెడ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, గిరిజన నాయకులు, వివిధ గ్రామాల రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## 128 కిలోల గంజాయి స్వాధీనం..

-ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

-రూ.64 లక్షల విలువైన గంజాయి పట్టుకున్న వైరా పోలీసులు




**వైరా :**
వైరా పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న 128 కిలోల ఎండు గంజాయిని పట్టుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వైరా ఏసీపీ సారంగపాణి వెల్లడించారు.శుక్రవారం వైరా ఎస్ఐ రామారావు తన సిబ్బందితో కలిసి వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామం వద్ద అంజనేయస్వామి దేవాలయం సమీపంలో వాహన తనిఖీలకు వెళ్తుండగా, రోడ్డుపక్కన ఐదు గోనె సంచులతో అనుమానాస్పదంగా నిలబడి ఉన్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వారిని తనిఖీ చేయగా, ఐదు గోనె సంచుల్లో మొత్తం 60 ప్యాకెట్లలో సుమారు రూ.64 లక్షల విలువైన 128 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు బయటపడింది.ప్రాథమిక విచారణలో ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి ప్రాంతం నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.అరెస్టు చేసిన నిందితుల్లో ఒడిశాకు చెందిన మనుయాల్ బోత్రా (22),లక్ష్మణ్ (24),ఆంధ్రప్రదేశ్లోని అనకాపల్లి జిల్లాకు చెందిన చిటికల సన్యాసినాయుడు (25) ఉన్నారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, సమాజాన్ని నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారం, రవాణా, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై ఖమ్మం కమిషనరేట్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. “మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి –– భవిష్యత్తును కాపాడుకోండి” అని విజ్ఞప్తి చేశారు.

## జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు

-రివార్డు చెక్కులు అందజేసిన ఎస్పీ రోహిత్ రాజు

-10 మందికి రూ.55.60 లక్షల రివార్డు పంపిణీ




**కొత్తగూడెం :**
ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ స్థాయి క్యాడర్ల 10 మంది సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన రివార్డులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన చేతుల మీదుగా అందజేశారు. మావోయిస్టు పార్టీలో పనిచేసిన సమయంలో వారి హోదా, బాధ్యతల ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రివార్డులను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. మొత్తం 10 మంది సభ్యులకు రూ.55.60 లక్షల నగదును అందజేశారు.రివార్డులు అందుకున్న వారిలో ఒకరు రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఒకరు డివిజనల్ కమిటీ సభ్యుడు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఇద్దరు దళ సభ్యులు ఉన్నారు. ప్రత్యేక చొరవతో లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం తరఫున రావాల్సిన రివార్డు నగదును అందజేసినట్లు ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా రివార్డులు అందుకున్న వారి ప్రస్తుత పరిస్థితులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన నగదును విలాసాలకు వినియోగించకుండా, జీవనోపాధికి ఉపయోగపడే విధంగా సక్రమంగా ఖర్చు చేసుకోవాలని సూచించారు.జిల్లా పోలీసులు చేపట్టిన “ఆపరేషన్ చేయూత” కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయిన మావోయిస్టులకు జిల్లా పోలీసు శాఖ పూర్తి అండగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. పునరావాసంతో పాటు ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను కల్పిస్తున్నామని వెల్లడించారు.

## ఖాతాదారుల విశ్వాసంతో దూసుకెళ్తున్న ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ

- రూ.5,136 కోట్ల టర్నోవర్తో దేశంలోని టాప్ మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీలలో స్థానం



**కూకట్ పల్లి :**
పీఎన్ఆర్ ఎంపైర్లో ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన ఆరు బ్రాంచ్ల ఖాతాదారుల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి సొసైటీ వైస్ చైర్మన్ పి.ఆర్.వి.పి.ఎస్ రాజు, డైరెక్టర్లు ఏ. సోమలింగం గౌడ్, లావణ్య రేఖ, అలాగే మేనేజింగ్ డైరెక్టర్ మన్నె నరేంద్ర కుమార్ హాజరై ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ మన్నె నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, ఖాతాదారుల విశ్వాసం, సభ్యుల సహకారం మరియు ఉద్యోగుల కృషితో సొసైటీ రూ.5,136 కోట్ల టర్నోవర్ను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇటీవల ప్రారంభించిన ఎల్బీ నగర్ మరియు విజయవాడ ఆటోనగర్ బ్రాంచ్లతో కలిపి ప్రస్తుతం 44 శాఖల ద్వారా ఆరు రాష్ట్రాల్లో 1.10 లక్షలకుపైగా సభ్యులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా విశాఖపట్టణం మధురవాడ మరియు మణికొండ ప్రాంతాల్లో కూడా త్వరలో కొత్త శాఖలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సభ్యులకు మరింత చేరువ కావడం, వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా విస్తరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. దేశంలోని టాప్-3 మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీలలో ఒకటిగా ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ నిలుస్తోందని, పారదర్శక సేవలు మరియు సభ్యుల నమ్మకమే ఈ విజయానికి మూలమని నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. సొసైటీ వైస్ చైర్మన్ పి.ఆర్.వి.పి.ఎస్ రంగరాజు మాట్లాడుతూ, సభ్యుల నిరంతర ఆదరణతో సొసైటీ మరింత అభివృద్ధి సాధించి అధిక లాభాల దిశగా ముందుకుసాగుతుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సేవలను సభ్యులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మేనేజర్లు ఎం. మురళీకృష్ణ, జీ. తాతాజీ, ఆర్. నరేంద్ర, వి. కృష్ణమోహన్, సి. గోపీశ్రీనాథ్, వి. వెన్నెల, వై. భావన తదితరులు, సిబ్బంది

## పశువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు డి.ఎస్.పి ఆదినారాయణ...

ఆరుగురు నిధులను అరెస్టు చేసిన ఎస్ఐ శివరామకృష్ణ...

వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి




**చంద్రుగొండ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో, శనివారం సాయంత్రం సమయంలో మహమ్మద్ నగర్ గ్రామం వద్ద మట్టి రోడ్డు, ఫారెస్ట్ ఏరియా సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా, AP 29 U 4656 నంబర్ గల అశోక్ లేలాండ్ 10 టైర్ల లారీలో ఎలాంటి సరైన అనుమతి పత్రాలు లేకుండా 28 పశువులను అత్యంత క్రూరంగా తాళ్లతో కట్టి రవాణా చేస్తుండగా గుర్తించారు. లారీలో ఉన్న డ్రైవర్ సయ్యద్ ఖాజా పాషా క్లీనర్ మహ్మద్ ఖురేషీ లను అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగించగా, మహమ్మద్ నగర్ గ్రామ శివారులో ఫారెస్ట్ ఏరియాను ఆనుకొని ఉన్న సయ్యద్ పీర్ మహమ్మద్ ఖాళీ వ్యవసాయ భూమి వద్ద మరిన్ని పశువులను రహస్యంగా దాచిపెట్టినట్లు తెలిసింది. వెంటనే ఆ స్థలానికి వెళ్లి పరిశీలించగా, అక్కడ 94 పశువులు ఎలాంటి మేత, నీరు, సరైన సంరక్షణ లేకుండా తాళ్లతో బంధించి ఉంచినట్లు గుర్తించారు. అక్కడ కాపలా కాస్తున్న ఎస్.కే. ఇస్మాయిల్, ఎస్.కే. నాగుల్ మీరా, సయ్యద్ పీర్ మహమ్మద్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మొత్తం 122 పశువులు AP 29 U 4656 నంబర్ గల లారీని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో, నిందితులు వివిధ ప్రాంతాల నుండి పశువులను కొనుగోలు చేసి, సరైన అనుమతి పత్రాలు లేకుండా రహస్యంగా హైదరాబాద్ వైపు తరలించి గోవధశాలలకు అమ్మి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. పశువులను క్రూరంగా కట్టి, వాటికి మేత నీరు ఇవ్వకుండా రవాణా చేయడం రహస్యంగా దాచిపెట్టడం గమనించబడింది. ఈ సందర్భంగా చంద్రుగొండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో శనివారం A1 మోయిజ్ ఖురేషీ, A2 ఎస్.కే. ఇస్మాయిల్, A3 ఎస్.కే. నాగుల్ మీరా, A4 సయ్యద్ పీర్ మహమ్మద్ A5 సయ్యద్ ఖాజా పాషా, A6 మహ్మద్ ఖురేషీ లను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచడం జరుగుతుంది. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో పశువుల అక్రమ రవాణా, గోవధ లేదా అనుమానాస్పద వాహనాల కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని పోలీసులు కోరుచున్నారు. ప్రజల సహకారంతో ఇటువంటి అక్రమ చర్యలను అరికట్టడానికి

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co